క్లుప్తంగా

నేడు ఉచితంగా సుగర్ పరీక్షలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాతబస్టాండు వద్దగల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్యాణ్ నేత్ర కేంద్రంలో ఉన్న మెడిసిన్ బ్యాంకులో మంగళవారం ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచితంగా సుగర్ పరీక్షలు చేయనున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రముఖ మధుమేహ వైద్యులు కెల్ల చిన్నబాబు ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారన్నారు. సుగర్ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజల్లోకి అంబేద్కర్ ఆశయాలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజల్లోకి అంబేద్కర్ ఆశయాలు తీసుకువెళ్లటమే లక్ష్యమని సామాజక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్ అన్నారు. ఈ నెల 19న ఎచ్చెర్ల మండల కేంద్రంలో ఈ జాతర నిర్వహించనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ పీఠం ఏర్పాటు చేయాలని కోరారు. పెయ్యిలవానిపేటలో అంబేద్కర్ జాతరపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతర నిర్వాహక కమిటీ ప్రతిధులు కంట్లాన రామారావు, దుర్గాసి గణేష్, టొంపల రమణ పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నగరాల కులస్తులు

జి.సిగడాం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాల కులస్తులను ఓసీ నుంచి బీసీ–డీలో చేర్చడంపై గంగన్నదొరపాలెంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి నగరాల రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ పిళ్లా ఆనందరావు పాత్రుడు, సర్పంచ్ తొత్తడి రామారావు ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ హయంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా జిల్లాల్లో ఉన్న నగరాలకు మాత్రమే బీసీ–డీ రిజర్వేషన్ కల్పించారన్నారు. నేడు సీఎం జగన్ హయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాలను బీసీ–డీలో చేర్చేందుకు జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి కనకారావు, బొల్లు రమణ, కె.సూర్యనారాయణ, లక్ష్మునాయుడు, పైల ఆదినారాయణ, పైల త్రినాథరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ నెట్‌లో 76వ ర్యాంక్



సురేష్

రణస్థలం: జాయింట్ సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ ప్రవేశ పరీక్షల్లో జే.ఆర్.పురం పంచాయతీకి చెందిన బవిరి సురేష్‌కు ఆల్ ఇండియా 76వ ర్యాంక్ వచ్చింది. జాయింట్ సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ప్రవేశ పరీక్ష జూన్–2023లో జరిగింది. కెమికల్ సైన్స్ విభాగంలో ఉత్తమ ర్యాంకు రావటంతో తిరుపతి ఐఐటీలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశం లభించిందని సురేష్ సోమవారం తెలిపారు.

పరామర్శ..



కృష్ణారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బావిశెట్టి కృష్ణారావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు బావిశెట్టి నారాయణ ప్పారావు, అల్లంపల్లి నాగ, జాడ శంకర్, భూపతిరాజు, బావిశెట్టి సీతన్న, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆకాశదీపాల పూజలు ప్రారంభం



ఆకాశ దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ఆకాశ దీపాల కార్యక్రమం ప్రారంభమైంది. అర్చకులు బి.అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాలను భక్తులు వెలిగించారు.

ఘనంగా దీపావళి పండగ

వెలుగుల పండుగ దీపావళిని ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచే కాకరపువ్వులు, భూచక్రాలు, తారాజువ్వల వెలుగులతో వీధులన్నీ మెరిసిపోయాయి. చిన్నా..పెద్దా తారతమ్యం లేకుండా కొత్త దుస్తులు ధరించి.. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. ఇళ్లలో, ఆలయాల్లో పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఇళ్లలో కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తూ ఆనందంగా గడిపారు. కొన్నిచోట్ల నరకాసురుని బొమ్మను కాల్చివేశారు.



జి.సిగడాం: సంతవురిటి బీసీ వసతి గృహంలో దీపాలు వెలిగించిన విద్యార్థులు



శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: కోటి వత్తులను వెలిగిస్తున్న భక్తులు



శ్రీకాకుళం కల్చరల్: దీపాల అలంకరణలో బలగ కాలభైరవాలయం



శ్రీకాకుళం కల్చరల్: బలగలో నరకాసుర దహనం



ఎచ్చెర్ల క్యాంపస్: అంబేద్కర్ గురుకులం విద్యార్థినులకు స్వీట్లు, టపాసులు అందజేస్తున్న ఎచ్చెర్ల ఎస్ఐ సత్యనారాయణ



శ్రీకాకుళం కల్చరల్: పీఎన్‌కాలనీ వరసిద్ధి వినాయక ఆలయంలో అష్టలక్ష్మికి పూజలు

అరుణాచలంలో సంప్రదాయ విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న సంప్రదాయ విద్యార్థులు



బ్రహ్మోత్సవాల్లో మెహెర్ నృత్య కళానికేతన్ చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరానికి సమీపంలోని కల్లేపల్లిలోని సంప్రదాయ గురుకులానికి చెందిన విద్యార్థులు అరుణాచలంలో జరిగిన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఆదివారం పిరమిడ్ మెడిటేషన్ డే, పిరమిడ్ వ్యవస్థాపకులు బ్రహ్మర్షి పత్రిజీ జన్మదినం సందర్భంగా అరుణ గిరీసుని చెంత చక్కనైన స్టేజి ప్రదర్శ ఇచ్చారు. సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ్ మాట్లాడుతూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఒంటి గంట వరకు 14 కిలోమీటర్ల అరుణాచల గిరి ప్రదక్షిణలో నడుచుకుంటు అష్ట లింగాల దగ్గర కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అరుణాచలం పిరమిడ్ కేంద్రం ఆర్గనైజర్ సునీత, సాయిరాం శ్రీనివాసరావు, తిరువన్నమలై అధికారులు పాల్గొన్నారన్నారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీకాకుళం చిన్నారుల ప్రదర్శన

తిరుమల తిరుపతి దేవస్థానం, పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి వాహన సేవలో భాగంగా పట్టణానికి చెందిన మెహెర్ నృత్య కళానికేతన్ చిన్నారుల ప్రదర్శన జరిగింది. నృత్య దర్శకులు మెహెర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు సంధ్య, ప్రతీక, సంహిత, అనురాధ, వాసంతి, సుధారాణి, దుర్గా, ప్రవల్లిక, పావని, సుజాత, గీతిక, లాస్య, కిరణ్మై, రమ్య, లాస్యలు నృత్య ప్రదర్శన ఇచ్చారన్నారు. వీరిలో రెడ్‌క్రాస్ అనురాగ నిలయం చిన్నారులు కూడా ఉన్నారు.

సమాజ సేవకు ముందుకురావాలి



రక్తదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: సమాజ సేవ చేసేందుకు దయాగుణంతో అందరూ ముందుకు రావాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవి కుమార్ అన్నారు. ప్రపంచ దయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధ జనాశ్రమంలో ఉన్నవారికి రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ జోన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, ప్రధాన కార్యదర్శి టి.రాంగోపాల్, సెక్రటరీ శిల్లా మణి, ఎల్సీఐఎఫ్ కోఆర్డినేటర్ సీపాన రమేష్‌కుమార్, సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, గుత్తు చిన్నారావు, క్లబ్ అడ్మినిస్టేటర్ జి.రామకృష్ణ, బి.ఆంజనేయులు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సునీల్, ఖ్యాతి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రావణి పాల్గొన్నారు.

శ్యాంపిస్టన్స్‌లో బలవంతపు రిటైర్మెంట్లు ఆపాలి



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకుడు అమ్మన్నాయుడు

రణస్థలం: శ్యాంపిస్టన్స్‌లో బలవంతపు రిటైర్మెంట్లు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, శ్యాంపిస్టన్స్(రింగ్స్) వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్యాంపిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్–2 పరిశ్రమలో పనిచేస్తున్న పలువురి కార్మికులను సర్వీసు పూర్తయిందనే నెపంతో యాజమాన్య ప్రతినిధులు బలవంతపు రిటైర్మెంట్లు చేస్తున్నారన్నారు. కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. విధుల నుంచి బలవంతంగా తొలగించడంతో మానసికంగా ఆందోళన చెందిన కార్మికుడు వై.వెంకటేశ్వర్లు మరో ఉపాధి ప్రయత్నంలో రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును పరామర్శించారు.

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల, ధర్మవరం గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు నీలమ్మ, చంద్రశేఖర్‌రావు సోమవారం తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యామకారుల గొప్పతనంపై అవగాహన, 17, 18 తేదీల్లో విద్యా సంబంధిత, క్రీడల పోటీలు, 19న రంగవల్లిక పోటీలు, ఇందిరా గాంధీ జయంతి, 20న చదవడం మాకిష్టం, ముగింపు కార్యక్రమాలు ఉంటాయన్నారు.

జి.సిగడాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి వెంకటేష్ తెలిపారు. ఈ 14 నుంచి 20వ తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు మండలంలోని లావేరు, మురపాక గ్రంథాలయాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

గార: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ తెలిపారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమంలో పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్వేత పుష్కరిణిలో నాచు తొలగింపు పూర్తి



నాచు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ రఘురామ్, ఈవో గురునాథం

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథలయంలోని శ్వేతపుష్కరిణిలో నాచు తొలగింపు దాదాపు పూర్తయ్యింది. పుష్కరిణిలో నాచు విపరీతంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడేవారు. పక్కనున్న పిండప్రదానాల రేవు వద్ద అపరకర్మలకు వచ్చేవారు కూడా అవస్థలు ఎదుర్కొనేవారు. ఈ నెలలో క్షీరాబ్ధిద్వాదశ రోజుల తెప్పోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ గొండు రఘురామ్, ఆలయ ఈవో జి.గురునాథం కంద్రవీధి స్వదేశీ మత్స్యకార సంఘం సభ్యులతో మాట్లాడి నాచు తొలగించాలని కోరారు. దీంతో కొద్ది రోజులుగా మత్స్యకారులు నాచు తొలగించడంతో శ్వేతపుష్కరిణి పరిశుభ్రంగా ఉంది. త్వరలోనే వంశధార నీరు పుష్కరిణికి పెట్టాలని ఇటీవల మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. దీంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ



మెడల్స్ అందుకుంటున్న నళినీ సుధాకర్

ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంజీవి నళినీ సుధాకర్.. మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ముషిరాబాద్‌లో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు బెంగాల్ మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అన్ లిమిటేషనల్ మాస్టర్ అథ్లెట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు కిలో మీటర్ల నడకలో బంగారు పతకం, 5 కిలో మీటర్లు, 1500 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించారు.

నేడు అరిణాంఅక్కివలసలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో మంగళవారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొంటారన్నారు. 14న అరిణాంఅక్కివలసలో, 15న జరజాంలో, 16న కేశవరావుపేటలో, 17న ఎస్ఎంపురంలో, 20న ఫరీదుపేటలో, 21న ఇబ్రహింబాద్‌లో, 22న పూడివలసలో నిర్వహించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ మేరకు మధ్యాహ్నం మూడు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ఫ్లెక్సీలు ఆవిష్కరణ, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ, కుల పెద్దలు, గ్రామస్తులతో సహపంక్తి భోజనాలు, గ్రామస్తుల సమస్యలు తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొనాలన్నారు.

శివపూజకు వేళాయె..

- నేటినుంచి కార్తీక మాసం ప్రారంభం
- ముస్తాబైన ఆలయాలు



ఉమారుద్ర కోటేశ్వరస్వామి



ఉమాజఠలేశ్వస్వామి



విద్యుత్ దీపాలంకరణలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయం

శ్రీకాకుళం కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం పట్టణంలోని శివ,కేశవ ఆలయాలు ముస్తాబయ్యాయి. మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసం ఉంటుంది. ఈ ఏడాది నాలుగు సోమవారాలు మాత్రమే పడ్డాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయాల్లో సంబంధిత కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

- బలరామ ప్రతిష్ఠ దేవాలయంగా ప్రఖ్యాతి చెందిన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయం కార్తీక మాసం కోసం ముస్తాబైంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు.
- కోన్నావీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కూడా ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము మూడు గంటలనుంచే ఆలయ దర్శనం ఉంటుంది. భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తారు. బలగ ఉత్తరేశ్వరాలయం, గుజరాతీపేటలోని లక్ష్మీశ్వరస్వామి ఆలయం, దీపామహల్ వెనుక ఉన్న శివకేశవ ఆలయం, పాతశ్రీకాకుళంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

వైష్ణవ ఆలయాలు కూడా..

కార్తీకమాసంలో విష్ణుమూర్తికి కూడా ప్రీతికరం కావడంతో ఈనెలలో వైష్ణవ ఆలయాలు కూడా భక్తులతో రద్దీగా ఉంటాయి. అందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష తులసీ దళార్చనలు 20 నుంచి 30 తేదీ వరకు నిర్వహిస్తున్నారు. అలాగే కలెక్టర్ బంగ్లా వద్దగల కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 14 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు నాగావళి నదీ హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావులు తెలిపారు. అలాగే సాయంత్రం ఆకాశ దీపారాధనలు, 23న సహస్ర దీపాల అలంకరణ, 24న శ్రీవారి అమ్మవార్ల తెప్పోత్సవం, డిసెంబర్ 13న పోలిపాడ్యమి సందర్భంగా అన్నప్రసాద వితరణ ఉంటుంది.

- పాలకొండ రోడ్డులోని పురాతన కోదండ రామాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు తెలిపారు. 24న మహాలక్ష్మీపూజ, 26 నుంచి రోజూ సాయంత్రం ఆకాశదీపాల పూజలు ఉంటాయి.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు



ఉర్జాపు అశోక్

శ్రీకాకుళం క్రైమ్: భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు చేసినట్టు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై బలివాడ గణేష్ సోమవారం తెలిపారు. పట్టణంలోని శరంగడల్ వీధికి చెందిన ఉర్జాపు అశోక్ (36) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల ఎనిమిదో తేదీ మధ్యాహ్నం 12 గంటలకు బయటకు వెళ్లిన అశోక్ తిరిగి ఇంటికి రాలేదని భార్య గాయత్రి తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.

కుప్పిలి కవితలకు స్వర్ణ కంకణం



ఆమదాలవలస: గంట వ్యవధిలో ఐదు కవితలు రాసినందుకు ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు స్వర్ణ కంకణం బహుమతి లభించింది. అక్టోబర్ 15న కరీంనగర్ ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కవితల పోటీల్లో వెంకటరాజారావు పాల్గొన్నారు. సాహితీ సామ్రాట్ పురస్కారాన్ని సోమవారం పోస్టల్ ద్వారా అందుకుని స్వర్ణకంకణ విజేతగా నిలిచారు. వెంకటరాజారావుకు పలువురు రచయితలు అభినందలు తెలిపారు.

ఈఓపీఆర్డీ మృతికి పలువురి సంతాపం



వెంకటేశ్వరరావు (ఫైల్)

హిరమండలం: హిరమండలం ఈఓపీఆర్డీ సంపతిరావు వెంకటేశ్వరరావు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వరరావు శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. గుండెపోటుతో తన స్వగృహం వద్ద మృతి చెందారు. ఈయన మృతిపట్ల ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ, తహసీల్దార్ బెహరా మురళీమోహన్ రావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు సోమవారం సంతాపం తెలియజేశారు.